
సాక్షి
ఒడిశా

బుధవారం । 17 । జనవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 6.44.012

- భువనేశ్వర్/పూరీ



ఘనంగా ప్రారంభిద్దాం

పూరీ ప్రాకారాన్ని నేడు ప్రారంభించనున్నారు. సీఎం నవీన్ పట్నాయక్ ప్రత్యేక సందేశమిచ్చారు. -8లో▸



క్రీడోత్సవాలు ప్రారంభం

పర్లాకిమిడిలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలు ఉత్సాహంగా జరిగాయి. -8లో▸

న్యూస్‌రీల్

ఘనంగా గురు గోవిందసింగ్ జన్మదినం



వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అభిమానులు

జయపురం: సిక్కుల మత గురువు గురు గోవిందసింగ్ జన్మదినోత్సవాన్ని జయపురంలో సిక్కులు ఘనంగా సోమవారం జరుపుకున్నారు. సిక్కులు తమ ఆచారం ప్రకారం పురుషులు ఖడ్గాలను, మహిళలు గోవింద సింగ్ చిత్రపటాలను పట్టుకొని పట్టణంలో ఊరేగించారు. గురుద్వార పరిచాలన కమిటీ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ జస్‌పాల్ సింగ్, సర్దార్ కరమ్ సింగ్, జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ మాజీ అధ్యక్షుడు రాజ్‌పాల్ ఖురాణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, కాంగ్రెస్ నేత దేవేంద్ర బాహిణీపతి, మాజీమంత్రి, బీజేడీ నేత రబినారాయణ నందో, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు రాధా వినోద్ సామంతరాయ్, జయపురం సమితి ఉపాధ్యక్షుడు గణేష్ ప్రసాద్ పాఢీ, బీజేపీ రాష్ట్ర కమిటీ శాశ్వత సభ్యుడు గౌతమ్ సామంతరాయ్, బీజేపీ నేత హామాంషు మహాపాత్రో పాటు విశ్వహిందూపరిషత్ సభ్యులు, రాష్ట్రీయ స్వయం సేవక సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి చామంతులతో అర్చనలు



చామంతులతో పూజలందుకున్న స్వామివారు

రాయగడ: మకర సంక్రాంతిని పురస్కరించుకుని జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న అయ్యప్ప స్వామి మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు క్వింటా చామంతి పువ్వులతో స్వామికి అర్చనలు చేశారు. ఈ సందర్భంగా మందిరం ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పాత్రికేయుడిపై హత్యాయత్నం



తీవ్రంగా గాయపడిన రాజేంద్ర గౌడ

జయపురం: ఒడిశా జర్నలిస్టు యూనియన్ కొరాపుట్ జిల్లా కార్యదర్శి, కొరాపుట్ జిల్లా యాదవ మహా సంఘ కార్యదర్శి రాజేంద్ర గౌడ్‌పై అతని బంధువు హత్యాయత్నం చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక విక్రమ క్రీడా మైదానంలో సోమవారం మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో మోటారు బైక్‌తో ఢీకొనడంతో రాజేంద్ర గౌడ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తీసుకువెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోదరుడు వరసైన సరోజ్ గౌడ కుటుంబంతో కలహాల కారణంగానే ఈ దాడి జరిగినట్లు అనుమానిస్తున్నారు. గతకొద్ది రోజుల కిందట కూడా రాజేంద్రపై దాడి చేసేందుకు సరోజ్ కుట్రపన్నాడని ఆరోపణలున్నాయి. జర్నలిస్టులు టి. గౌరీశంకర్, చంద్రకాంత్ సుతార్‌లతో మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో రాజేంద్రను వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడ్డారని సమాచారం. రాజేంద్ర తలకు బలమైన దెబ్బ తగిలింది. ఈ దాడిని జర్నలిస్టులు, యాదవ మహాసంఘం ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. రాజేంద్ర వేగంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

పేదలకు రగ్గులు పంపిణీ



నబరంగ్‌పూర్‌లో రగ్గులు పంపిణీ చేస్తున్న కిన్నెరలు

కొరాపుట్: చలి తీవ్రత నేపథ్యంలో పేదలను ఆదుకోవడానికి కిన్నెర (హిజ్రా)లు ముందుకు వచ్చారు. నబరంగ్‌పూర్ జిల్లా కిన్నెర సంఘం ఉచితంగా రగ్గులు పంపిణీ చేయాలని మంగళవారం పిలుపు నిచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న కిన్నెరలు తమ ప్రాంతాల్లో పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ పిలుపు ఒక ఉద్యమంలా సాగింది. సంఘంలో లేని అధిక సంఖ్యలో ఉన్న కిన్నెరలు కూడా స్పందించారు. సామాజిక మాధ్యమాల్లో చూసి తక్షణ కర్తవ్యంగా ఎవరు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలో రగ్గులు స్వచ్ఛందంగా పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు.

సంక్రాంతి సందడి

- ఘనంగా సంక్రాంతి సంబరాలు
- ఊరూవాడా వేడుకలు



బరంపురం : గోపాల్‌పూర్ సంక్రాంతి ఉత్సవాల్లో ఆకట్టుకున్న కటక్ కళాకారుల ఒడిస్సీ నృత్యం



జయపురం: సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న జనం

జయపురం: జయపురంలో తెలుగువారి లోగిళ్లు పండగ కళతో సందడిగా కనిపించాయి. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సోమవారం ప్రసిద్ధ గుప్తేశ్వర్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి స్థానిక నారాయణి పాఠశాలలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు సినీ నటుడు ఆలీ హాజరయ్యారు. అలాగే హైదరాబాద్, కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచి కళాకారులు వచ్చి ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జయపురంలో సీనియర్ న్యాయవాది దాశరధి పట్నాయిక్ దంపతులను, ఆలయాల పూజారులు సాలూరు పంతులు, బాడంగి సత్యనారాయణ శర్మ పంతులు, తెలుగు డాక్టర్లు డాక్టర్ ఆదిత్య, డాక్టర్ జామి తేజశ్వనిలను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, మీనాక్షి బాహిణీపతి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పూర్‌లో..

బరంపురం : అంతర్జాతీయ పర్యాటక స్థలంగా గుర్తింపు పొందిన గోపాల్‌పూర్ సాగర తీరంలో గోపాల్‌పూర్ ఎన్‌ఏసీ పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సంక్రాంతి ఉత్సవాలు జరిగాయి. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాదేవి రాణి పాల్గొని జ్యోతిని వెలిగించారు. ఒడిశా చలన చిత్ర నటులు పాల్గొని ప్రదర్శనలిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్, విజయనగరానికి చెందిన రవికుమార్, రత్నకుమారి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. గంజాం వాసులు ప్రదర్శించిన ఒడిస్సీ నృత్యం అలరించింది.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: స్థానిక రాంనగర్‌లోని హైటెక్ ప్లాజాలో మకర సంక్రాంతి ఉత్సవాలు సందర్భంగా పరలా కళా సంస్కృతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బుల్లితెర జబర్దస్త్ కళాకారులు, స్థానిక కళాకారులు నిర్వహించిన ప్రదర్శనలు అలరించాయి. జబర్దస్త్ కళాకారులు ఆటో రాంప్రసాద్, నూకరాజు, దొరబాబు, తన్మయి, ఇమ్మాన్యుయేల్ స్కిట్‌లు ప్రేక్షకులను నవ్వించాయి. యాంకర్‌గా శివానీ వ్యవహరించగా పుష్ప డ్యాన్సు, ఇతర కళాకారుల డ్యాన్సులు అలరించాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు కళాకారులను, చిరు వ్యాపారులు రంజిత్ కుమార్ మహాపాత్రో తదితరులను సన్మానించారు. కార్యక్రమం హైటెక్ విద్యాసంస్థల ఎండీ రూపేష్ పాణిగ్రాహి, ఎం.డీ. సురేష్ పాణిగ్రాహి, చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి ఆధ్వర్యంలో జరిగాయి.



బ్రాహ్మణ సావనీర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

సంప్రదాయాలు గౌరవించాలి

రాయగడ: అనాదిగా వస్తున్న హిందూ సంప్రదాయాలను మనమంతా గౌరవించాలని గుణుపూర్ బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు పతితపావన పండ అన్నారు. గుణుపూర్‌లో గల విద్యానికేతన్ మైదానంలో సోమవారం నాడు మకర సంక్రాంతి సందర్భంగా బ్రాహ్మణ సమాజం వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. హిందు సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం బ్రాహ్మణ పేరుతో రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాజం సభ్యులు నరసింహ సతపతి, తిరుపతి రాథొ, తిరుపతి మహంతి, డాక్టర్ ప్రశాంత్ హొతా, క్రిష్ణ ప్రసాద్ మిశ్రొ, ఉమాశంకర్ దాస్ అశ్విని పండ తదితరులు పాల్గొన్నారు.



ముత్తైదువులకు వాయినాలు సమర్పించి పూజిస్తున్న దృశ్యం

రాయగడలో..

రాయగడ: పట్టణంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఉదయం సంప్రదాయ పూజలను నిర్వహించారు. ముత్తైదువులకు వాయినాలు సమర్పించారు. పండగతో పట్టణం సందడిగా కనిపించింది.



పర్లాకిమిడి: జబర్దస్త్ కళాకారుల అభినయం



బరంపురం : గోపాల్‌పూర్ సంక్రాంతి ఉత్సవాల్లో మంత్రి ఉషాదేవి, ఎంపీ శేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ తదితరులు



బరంపురం : గోపాల్‌పూర్ సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొన్న జనం



పర్లాకిమిడి: రంజిత్ కుమార్ మహాపాత్రోను సన్మానిస్తున్న జిల్లా పరిషత్ అధ్యక్షుడు జి.తిరుపతి రావు



జయపురం: కళాకారులతో డ్యాన్స్ చేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

కళలకు పుట్టినిల్లు గంజాం

- మాజీ ఎంపీ ప్రసన్న పట్టసాని
- ముగిసిన బుద్ధకులో మహోత్సవాలు

బరంపురం: కళలకు పుట్టినిల్లుగా గంజాం జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందిందని మాజీ ఎంపీ ప్రసన్న పట్టసాని అన్నారు. గంజాం జిల్లా పులసరా బ్లాక్ క్రీడా మైదానంలో గత మూడు రోజులుగా జరుగుతున్న బుద్ధకులో మహోత్సవాలు సోమవారం రాత్రితో అంగరంగ వైభవంగా ముగిశాయి. ఈ మహోత్సవాలకు ముఖ్య అతిథిగా ప్రసన్న పట్టసాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాష జాతిని గుర్తిస్తే.. మన సంస్కృతి, సంప్రదాయాలు దేశాన్ని గుర్తిస్తున్నాయని అన్నారు. స్థానిక కళాకారులు ప్రభు.. జగన్నాథ్ దేవత విగ్రహం దగ్గర ఒడిస్సీ నృత్యంతో భక్తిగీతాన్ని ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారు చేసిన సంబల్‌పూరి నృత్యం, భరత నాట్యం ఎంతగానో ఆకట్టుకున్నాయి. కళాకారులను సత్కరించి, గుర్తింపు పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ సాహు సుభాష్ మహరణ, బరంపురం మాజీ ఎమ్మెల్యే చావ్ పట్నాయక్ పాల్గొన్నారు.



మహోత్సవాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ సాహు సుభాష్ మహరణ



మహోత్సవాలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ ప్రసన్న పట్టసాని



మహోత్సవాల్లో పాల్గొన్న జన సందోహం

నీటిని ఆదా చేయాలి

- అదనపు మేజిస్ట్రేట్ భాస్కరరైతా

రాయగడ: పంటలు సస్యశ్యామలంగా పండాలంటే రైతులు ప్రతీ నీటిబొట్టును పొదుపుగా వాడడంతో పాటు ఆదా చేయాలని జిల్లా అదనపు మేజిస్ట్రేట్ భాస్కరరైతా అన్నారు. స్థానిక కలక్టర్ కార్యాలయం ప్రాంగణంలో సూక్ష్మనీటి పారుదల విభాగం ఏర్పాటు చేసిన చైతన్య రథాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే నీటి వృథాను అరికట్టాలని, ప్రతీ నీటిబొట్టు భూగర్భంలో ఇంకేవిధంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని చైతన్య పరిచారు. ఈ విషయమై రైతాంగానికి చైతన్య పరిచేందుకు అన్ని గ్రామాల్లో చైతన్య రథంతో ప్రచారం చేస్తామన్నారు. మైనర్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దూసి శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ.. పాణి పంచాయతీలపై కూడా అవగాహన కల్పించడంతో పాటు రైతుల్లో వ్యవసాయ విధానాలపై పూర్తిస్థాయి ప్రచారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. వాటర్ షెడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దయానిధి బాగ్, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చైతన్యరథాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు



ఈవీఎంల వినియోగ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కల్యాణి సంఘమిత్రాదేవి

- సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి

రాయగడ: ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామని సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి వెల్లడించారు. అందుకు సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈవీఎంల వినియో అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో కేవలం 72 శాతం ఓటింగ్ నమోదైందని గుర్తు చేశారు.

ఓటింగ్ యంత్రాల వినియోగంపై ఓటర్లకు చైతన్యం తీసుకువచ్చేలా కృషి చేయాని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో వచ్చే నెలాఖరువరకు చైతన్యం కల్పించేందుకు అన్ని గ్రామాల్లో చైతన్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బిజూ శాంతి ఉద్యానవనం ప్రారంభం



విద్యుత్ వెలుగులతో బిజూ శాంతి ఉద్యానవనం

జయపురం: పట్టణంలోని బిజూ పట్నాయక్ శాంతి ఉద్యానవనాన్ని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సోమవారం ప్రారంభించారు. పురాతన ఖజురీబందను జయపురం మున్సిపాల్టీ పునరుద్ధరించిందని, దీనిని ప్రజలకు అంకితం చేస్తున్నామన్నారు. జయపురం పట్టణాన్ని సుదరనగరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాల్టీ కృషి చేస్తోందని, దీనికి తన పూర్తి మద్దతు ఉంటుందని వెల్లడించారు. అనంతరం 25వ వార్డులో శౌచాలయాన్ని, 21వ వార్డులో గంగా మా మందిర ప్రాంతంలో ఓపెన్ స్పేష్ ప్రాజెక్టులను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, ఉపాధ్యక్షురాలు బి.సునీత, కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పటాన్నయక్, కౌన్సిలర్లు భద్రా దేవి, జసపాల్ సింగ్, శశిరేఖ పరజ, శాంతి జెన తదితరులు పాల్గొన్నారు.


క్లుప్తంగా

42 లీటర్ల సారా స్వాధీనం

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గల జేకేపూర్‌లో బైక్‌పై నాటుసారాను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అబ్కారీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. వారి వద్ద 42 లీటర్ల సారా, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు అబ్కారి శాఖ ఎస్ఐ హిమాంశు శేఖర్ మల్లిక్ తెలిపారు. జేకేపూర్‌లో సోమవారం పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో బైక్‌పై నాటుసారా తరలిస్తున్న అభి మహనందియా, ఛాబి గంట పుట్టుబడినట్లు తెలియజేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు.

సారా బట్టీలపై పోలీసులు దాడులు


సారా నిల్వలను ధ్వంసం చేస్తున్న పోలీసులు


నిల్వ ఉంచిన బెల్లం ఊట

బరంపురం: గంజాం-గజపతి జిల్లాల సరిహద్దులోని లకాడి అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన నాటు సారా, ఊట బెల్లంపై బరంపురం ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడి చేశారు. 1000 లీటర్ల బెల్ల ఊటను ధ్వంసం చేసినట్లు బరంపురం ఎక్సైజ్ అధికారి రామచంద్ర మిశ్రా తెలిపారు. సారా నిల్వ ఉంచినట్లు సమాచరం మేరకు బరంపురం ఎక్సైజ్ విభాగం దిగపండి అటవి అధికారులు, మోహనా పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడి చేసినట్లు చెప్పారు. నిల్వ ఉంచిన వంట సారా, ఊట బెల్లం, మౌలి ధ్వంసం చేశామన్నారు. సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

వాలీబాల్ విజేత ఇంద్రావతి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాహినీపతి

జయపురం: బొరిగుమ్మ సమితి సర్గిగుడ గ్రామ దేవత మందిరం మైతీనంలో గత పది రోజులుగా నిర్వహించిన నానాకె వాలీబాల్ టోర్నమెంట్‌లో నవరంగపూర్ జిల్లా ఇంద్రావతి టీమ్ విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్ పోటీల్లో బొరిగుమ్మ సమితి సనపారియ గ్రామ పంచాయతీ టీమ్‌పై ఇంద్రావతి టీమ్ విజయం సాధించింది. ఈ పోటీల్లో 16 టీమ్‌లు పాల్గొన్నాయి. విజేతలకు రూ.30 వేల నగదు, ట్రోఫీని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ అందజేశారు. రన్నర్ టీమ్‌కు రూ.20 వేలతో పాటు రన్నర్ ట్రోఫీ అందజేసి సన్మానించారు. ఈ టోర్నమెంట్‌ను నానాకె వాలీబాల్ కమిటీ సభ్యులు పూర్ణ, గోవింద, టున మరియు తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొరిగుమ్మ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ కుమార్ గంతాయిత్, బొరిగుమ్మ వ్యాపార సంఘం అధ్యక్షుడు సూర్య నారాయణ ఆచారి, అశోక్ భూమియ పాల్గొన్నారు.

గజపతి జిల్లా నుంచి నలుగురు సేవాయత్‌లు


వాహనాలను ప్రారంభిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: శ్రీజగన్నాథ మందిరం ప్రాకార ప్రాజెక్టు లోకార్పణకు గజపతి జిల్లా పర్లాకిమిడి శ్రీజగన్నాథ మందిరం నుంచి నలుగురు సేవాయత్‌లతో ఒక వాహనాన్ని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ జెండా ఊపి ప్రారంభించారు. నలుగురు సేవాయత్‌లు దుర్గా మాధవ పాణిగ్రాహి, ప్రదీప్త పండా, కాశీనగర్ జగన్నాథ మందిరం నుంచి ఆనంద్ చంద్ర పాత్రో, రుషికేష్ గౌడోతో సహా నోడల్ అధికారి రాకేష్ కుమార్ పరిదాలు ఒక ప్రత్యేక వాహనంలో పూరీకి బయలుదేరారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు


కారు తనిఖీ చేస్తున్న సీఐ సాయి

పాతపట్నం: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు పాతపట్నం, మెళియాపుట్టి మండలం వసుంధర చెక్ పోస్టుల వద్ద ముమ్మర వాహన తనిఖీలు చేపడుతున్నామని పాతపట్నం సీఐ నల్లి సాయి తెలిపారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సరిహద్దు చెక్‌పోస్టులో మంగళవారం సీఐ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారని, ఒక్కో చెక్‌పోస్ట్ వద్ద ఒక ఎస్ఐతో పాటు నలుగురు కానిస్టేబుళ్లను నియమించామన్నారు.

వారసత్వ ప్రాకారం ఘనంగా ప్రారంభిద్దాం

- ఉత్సవం భక్తి శ్రద్ధలతో జరుపుకుందాం
- సులభ దర్శనానికి మార్గం సుగమం
- రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విజ్ఞప్తి


శ్రీ మందిరం వారసత్వ ప్రాకార దృశ్యం


శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో వేద పారాయణ మండపం

భువనేశ్వర్:

పూరీ శ్రీ మందిరం వారసత్వ ప్రాకారం ఘనంగా ప్రారంభిద్దామని సీఎం నవీన్ పట్నాయక్ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయన బుధవారం పూరీలో శ్రీ మందిరం వారసత్వ ప్రాకారం జగన్నాథునికి అంకితం చేయనున్నారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో కార్యక్రమంలో పాలుపంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 17.22 ఎకరాల సేకరణకు రూ. 500 కోట్లు వెచ్చించారు. ఒబొధా కార్యక్రమం కింద శ్రీ మందిరం వారసత్వ ప్రాకారం నిర్మాణానికి రూ. 800 కోట్లు ఇతరేతర ఖర్చులతో ప్రాజెక్టుకు సమగ్రంగా రూ. 4,224 కోట్లు వెచ్చించారు.

మంచి పని ప్రారంభిద్దాం

పూరీ శ్రీ జగన్నాథుడు ఒడియా ప్రజల చిరుమానా అని, ఆయన పేరు మీద మనం అంతా మంచి పనులను ప్రారంభిద్దామని తెలిపారు. మన సంప్రదాయానికి, సంస్కృతికి, చైతన్యానికి మూలాధారం ఆయనేనని, జగన్నాథుని సంస్కృతి మన సంస్కృతికి పునాది అని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. ఆలయం చుట్టూ విస్తరించిన ప్రాకార బాటలో భక్త జనం సులభ రీతిలో సురక్షితంగా దర్శనం చేసుకునేందుకు మార్గం సుగమమైందని ఆయన పేర్కొన్నారు. పుణ్యక్షేత్రం ప్రదక్షిణ చేసేటప్పుడు భక్తులు, ప్రజలకు శాంతి, దైవిక ఆనందాన్ని అందించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం అని ఆయన తెలిపారు. గత 700 ఏళ్లలో ఇలాంటి ఘనమైన కార్యం జరగలేదని, ఇది సమగ్ర ఒడియా జాతికి పండగ దినమని అన్నారు.

శంఖ ధ్వనితో దీపాలు వెలిగిద్దాం

ప్రాకార ప్రారంభోత్సవం చరిత్రలో అత్యంత ఆనందమైన రోజుగా మిగిలిపోతుందని ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వామి భక్తులు దీపావళి పండగలా జరుపుకోవాలన్నారు. ప్రతి ఇంటా ముంగిట, స్థానిక ఆలయాల ప్రాంగణాల్లో దీపాలు వెలిగించి శంఖ ధ్వనితో మేళతాళాల నడుమ భగవన్నామ సంకీర్తన, భక్తి స్తోత్ర పారాయణం వంటి కార్యకలాపాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.


శ్రీ మందిరం ప్రాకార సంకీర్తన ఆలాపన


వారసత్వ ప్రాకార మహోత్సవంలో యజ్ఞ మండపంపై వైష్ణవాగ్ని సంస్కారం


మహా యజ్ఞం ప్రాంగణంలో సూర్య పూజ


మహా యజ్ఞం నిర్వహణలో ప్రధాన బ్రాహ్మణుల బృందం

'జీరో ప్రమాదాలే లక్ష్యం'


రహదారి భద్రతా మాసోత్సవాల్లో మాట్లాడుతున్న డిపోమేనేజర్-1 మల్లికార్జునరావు

శ్రీకాకుళం క్రైమ్ : జీరో ప్రమాదాలే లక్ష్యంగా ఏపీ ఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతామని శ్రీకాకుళం డిపో మేనేజర్లు మల్లికార్జునరావు, ఎస్ఎస్ శర్మ అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రహదారి భద్రతా మాసోత్సవాలను జిల్లా కేంద్రంలోని ఏపీఎస్ఆర్టీసీ కాంప్లెక్సులో డిపో మేనేజర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని, బస్సు స్టీరింగ్ మన చేతుల్లో ఉండేటప్పుడు వెనుక కూర్చున్న ప్రయాణికుల ప్రాణాలు మన చేతుల్లోనే ఉన్నాయన్న విషయం గుర్తు పెట్టుకోవాలని, హైవేల్లో జాగ్రత్తగా నడపాలని అన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ మాట్లాడుతూ ఫుట్‌పాత్ ప్రయాణాలను కండక్టర్లు నిలువరించాలని, ముఖ్యంగా కళాశాలలు, స్కూల్ విద్యార్థులు వారి సమయాల్లో ఇలాంటి ప్రయాణాలు చేస్తుంటారన్నారు. నగరంలో బస్సులు ఎంటర్ అయ్యేటప్పుడు రద్దీ దృష్ట్యా నెమ్మదిగా తీయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంటు మేనేజరు వేదుళ్ల రమణ, ట్రాఫిక్ పోలీసులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

వారణాసి, ప్రయాగ్ రాజ్‌కు రెండు బస్సులు


తీర్థయాత్ర పథకం ద్వారా వృద్ధులను బస్సుల్లో పంపుతున్న పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి

పర్లాకిమిడి: వయో వృద్ధుల తీర్థయాత్ర పథకం కింద 90 మంది వారణాసి, ప్రయాగరాజ్‌కు రెండు బస్సుల్లో గజపతి ఇండోర్ స్టేడియం నుంచి బయల్దేరారు. ఈ బస్సులను జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి రావు, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి ప్రారంభించారు. 17న బరంపురం చేరుకుని అక్కడి నుంచి ట్రైన్‌లో వారణాసి వెళతారు. తిరిగి ఈ నెల 22న పర్లాకిమిడికి చేరుకుంటారని కలెక్టర్ తెలియజేశారు. గుసాని సమితి నుంచి 32, కాశీనగర్ ఎన్ఏసీ నుంచి 9, మోహానా నుంచి 6, పర్లాకిమిడి నుంచి 7, గుమ్మా నుంచి 17మంది బయలుదేరారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు ఈ తీర్థయాత్ర పథకానికి అర్హులని డీసీపీయూ అరుణ్‌కుమార్ త్రిపాఠి తెలిపారు.

ప్రాకార మహోత్సవం సైకత యానిమేషన్


శ్రీ మందిరం వారసత్వ ప్రాకార మహోత్సవం సైకత యానిమేషన్‌లో శిల్పి మానస కుమార్ సాహు

భువనేశ్వర్: అంతర్జాతీయ సైకత యానిమేటరు మానస్ కుమార్ సాహు పూరీలో శ్రీ మందిరం వారసత్వ ప్రాకారం అంకిత మహోత్సవ ఇతివృత్తం సైకత యానిమనేషన్‌లో చిత్రీకరించారు. పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ రాజగురువుకి వక్క, బియ్యం, కొబ్బరికాయను నైవేద్య సమర్పణ, బ్రాహ్మణులు కార్యక్రమాన్ని ప్రారంభించడం, దేవతల ఆవాహన, ఇతరేతర మహోత్సవ సంబంధిత ఘట్టాల్ని ఈ చిత్రీకరణలో ప్రదర్శించడం విశేషం. మహారాజా దివ్యసింగ్ దేవ్ యాగం పూర్ణాహుతి, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శ్రీమందిర వారసత్వ ప్రాకారం ప్రారంభోత్సవాన్ని ఈ యానిమేషన్‌లో శిల్పి ప్రదర్శించాడు. సమగ్రంగా 3 నిమిషాల 39 సెకన్లు నిడివితో ఈ వీడియో చిత్రీకరణకు మానస్ కుమార్ సాహు 15 గంటలు శ్రమించినట్లు తెలిపాడు.

సీతకొండ విద్యుద్దీకరణకు రూ.12.5 లక్షలు


సీతకొండ ఆంజనేయస్వామి మందిరం వద్ద ఎమ్మెల్యే నారాయణ రావు

పర్లాకిమిడి: గుసాని సమితి పెద్ద కొత్తూరు పంచాయతీలో ఉన్న కనుమ నాడు సీతకొండపై జాతర జరిగింది. జాతరకు పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు విచ్చేసి కొండపై విద్యుత్ దీపాలు, సరఫరాకు ఎమ్మెల్యే లాడ్ నిధుల నుంచి రూ.12.5 లక్షలు అందజేశారు. సీతకొండపై కనుమ, ముక్కనుమ నాడు పొరుగు రాష్ట్రాల నుంచే కాకుండా చత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు వస్తారు. రాత్రి వేళ కొండపై దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొండపై గత ఏడాది ఆంజనేయస్వామి మందిరం కూడా నిర్మించారు. ఈ నిధులతో విద్యుత్ దీపాలు ఏర్పాటు కానున్నాయి.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

రాయగడ: స్థానిక భైరవీధిలోని బురదల పొలమ్మ అమ్మవారి ఆలయ పరిసరాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద రూ. 65,204 నగదు, మూడు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ కమలాకంత్ తెలియజేశారు.

19 మంది జూదగాళ్ల అరెస్టు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని ఉప్పరవీధి శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 9 మందిని, మండలంలోని చిన్నలోగిడి గ్రామంలో శిబిరంపై దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకుని, అరెస్టు చేశామని మహమ్మద్ యాసీన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం ఉప్పరవీధి, చిన్నలోగిడి గ్రామంలో కొందరు వ్యక్తులు జూదం ఆడుతున్నట్టు పక్కా సమాచారం అందడంతో శిబిరాలపై దాడి చేసి 19 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.50,620 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పాండ్యన్‌కు కృతజ్ఞతలు


పాండ్యన్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఎంపీ రమేష్, ఎస్‌డీసీ ప్రదీప్ తదితరులు


ర్యాలి గా వెళ్తున్న గొండో జాతి గిరిజనులు

కొరాపుట్: రాష్ట్ర 5టి చైర్మన్ వి.కార్తికేయ పాండ్యన్‌కి గొండో సమాజ్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం భువనేశ్వర్‌లో శంఖ్ భవన్‌కి నబరంగ్‌పూర్ జిల్లా నాయకులు తరలి వెళ్లారు. ఈనెల 9న పాండ్యన్ నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్‌కి వచ్చారు. ఆ సమయంలో గొండో గిరిజన తెగ నాయకులు తమ జాతి ప్రజల అభివృద్ధి కోసం వినతి అందించారు. పాండ్యన్ రాజధానికి వెళ్లిన వెంటనే వారి సమస్యలు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కి తెలియజేశారు. అనంతరం బుద్ద దేవ్ భవనం కోసం రూ.1.50 కోట్లు, గొండో సమాజ్ భవన్ నిర్మాణం కోసం రూ.50 లక్షలు మంజూరు చేశారు. దాంతో రాయిఘర్,ఉమ్మర్ కోట్ ప్రాంతాల్లో ఉన్న గొండో జాతి గిరిజనులు తమ సంప్రదాయ వేషధారణతో పాండ్యన్ వద్దకు వెళ్లారు. గిరిజన వాయిద్యాలు వాయిస్తూ ర్యాలీ చేశారు. పాండ్యన్‌ని కలసి కృతజ్ఞతలు తెలిపారు.

కోడి రామ్మూర్తికి ఘనంగా నివాళి


కోడి రామ్మూర్తి విగ్రహానికి పూలదండతో నివాళులర్పిస్తున్న శ్రీధర్‌రావు, ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: కలియుగ భీముడిగా కీర్తి పొందిన కోడిరామ్మూర్తి నాయుడు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. సెట్‌శ్రీ సీఈఓ బీఎస్ ప్రసాదరావు, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావులు కోడిరామ్మూర్తి విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. యావత్ భారతదేశం గర్వించదగ్గ మల్లయోధుడు కోడిరామ్మూర్తి అని పీడీ డాక్టర్ గుండబాల మోహన్ కొనియాడారు. ఆయన పేరిట శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కోడిరామ్మూర్తి స్టేడియాన్ని నిర్మించడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు జి.అర్జున్‌రావురెడ్డి, కె.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం


జిల్లా స్థాయి క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి రావు


వివిధ మండల కేంద్రాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు

పర్లాకిమిడి: స్థానిక శ్రీక్రిష్ణచంద్ర గజపతి కళాశాల ఆవరణలో నువా ఒడిశా..యువ ఒడిశా.. ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడోత్సవాలను కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి రావు, మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెఠి, ఏడీఎం రాజేంద్ర మింజ్, ఎస్‌డీసీ చైర్మన్ మరియం రైయితో, గుసాని సమతి అధ్యక్షులు ఎన్.వీర్రాజు, మోహానా సమితి అధ్యక్షులు రంజీవ్ శోబోరో, రాయగడ సమతి అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, జిల్లా క్రీడాధికారి ప్రాణకృష్ణ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రధాన్ మాట్లాడుతూ, జిల్లాలో క్రీడాకారుల్లో స్ఫూర్తిని పెంచి.. రాష్ట్రంలో గజపతి జిల్లా విజయం సాధించేందుకు కృషి చేద్దామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు నువా ఓడిశా..యువ ఒడిశా.. పథకం అన్ని జిల్లాల్లో అమలు చేస్తోందని, ఇందులో ఎంపికైన వారికి ఈనెల 23న గజపతి స్టేడియంలో 5టీ క్యాబినెట్ మంత్రి కార్తికేయన్ పాండియన్ చేతులమీదుగా బహుమతులు, నగదు అందజేస్తామని అన్నారు. జిల్లాకేంద్రంలో ఎస్‌కేసీజీ కళాశాల మైదానంలో క్రికెట్, జవహర్ నవోదయ విద్యాలయంలో హాకీ, ఫుట్‌బాల్, కేంద్రియ విద్యాలయంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాధికారి ప్రాణకృష్ణ పాణిగ్రాహి అన్నారు. అనంతరం కలెక్టర్, జిల్లా పరిషత్తు చైర్మన్ గవర తిరుపతి రావులు ఏడు సమితి కేంద్రాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. అనంతరం క్రీడా పతాకాన్ని ఎగురవేసి జిల్లా క్రీడోత్సవ పోటీలను ప్రారంభించారు.

క్లుప్తంగా

బంగారం షాపులో చోరీ



చోరీకి గురైన బంగారం షాపు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని ఓ నగల షాపులో దొంగలు చోరీకి పాల్పడ్డారు. సోమవారం వేకువజామున జరిగిన ఈ సంఘటనపై పట్టణ సీఐ కృష్ణారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ బంగారం షాపులో చోరీ జరిగి, 2 కేజీల వెండి, బంగారం నగలు పోయినట్లు షాపు యజమాని శ్యామలా దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

62 మద్యం సీసాలు సీజ్


సీజ్ చేసిన మద్యం బాటిల్స్‌తో ఎస్సై రామగణేష్, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని చనమల్లుపేట జంక్షన్‌లో మద్యం బెల్ట్‌షాపుపై పోలీసులు మంగళవారం దాడి చేసి 62 మద్యం బాటిల్స్ సీజ్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీ చేపట్టి..బెల్ట్‌షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కోర్టుకు అప్పగించామని ఎస్సై రామగణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం అక్రమ అమ్మకాలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టామని, గ్రామాల్లో బెల్టు షాపు నిర్వహిస్తే తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాన్, కారు ఢీకొని ముగ్గురి మృతి


సంఘటన స్థలంలో మృతదేహాలు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి వద్ద జాతీయ రహదారిపై డీసీఎం వ్యాన్, కారు ఢీకొనగా జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఈ ప్రమాదంపై పెదమానాపురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం(బెలగాం)నుంచి వైజాగ్ (ఎండాడకు) నలితం సత్యనారాయణ (విశ్రాంత ఏఎస్సై), భార్య నర్సకుమారి, వరుసకు కుమారుడు మహేష్(విశ్రాంతి ఆర్మీ) మంగళవారం సాయంత్రం కారులో వెళ్తుండగా కోమటిపల్లి వద్ద వద్ద వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే నర్సకుమారి(58)మహేష్(45) మృతిచెందారు. గాయాల పాలైన సత్యనారాయణను, విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్సై మహేష్ చెప్పారు. మృతుడు మహేష్‌కు భార్య సవిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం


సురేష్ మృతదేహం

పద్మనాభం (విశాఖ జిల్లా): పండగ వేళ ఓ కుటుంబంలో విషాదం నెలకొంది. సంక్రాంతికి ఊరుకు వెళ్తున్న యువకుడిని బస్సు రూపంలో మృత్యువు కబళించింది. చిన్నాపురం జంక్షన్ సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొట్టి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. అగనంపూడి నుంచి కుమిలి సురేష్(33) మోటార్ బైక్‌పై సోమవారం ఉదయం తన సొంత గ్రామమైన పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం నారాయణపురం వెళ్తున్నాడు. పద్మనాభం మండలం చిన్నాపురం జంక్షన్ సమీపంలోని చెరువు వద్దకు రాగానే.. విజయనగరం నుంచి సింహాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ సంఘటనలో సురేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అతని తండ్రి రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వైద్యసిబ్బంది ఫుల్.. సేవల్లో జాప్యం నిల్..!

- నిరంతర ప్రక్రియగా ఖాళీల భర్తీ
- పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండడంతో మెరుగైన సేవలు



పార్వతీపురంటౌన్: వైద్యశాఖలో ఉద్యోగ నియామకాల ప్రక్రియ నిరంతరంగా సాగుతోంది. కొత్తగా క్రియేట్ చేసిన పోస్టులతో పాటు, ఉద్యోగ విరమణతో ఖాళీ అయిన పోస్టులను సైతం ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నారు. దీంతో వరుస నోటిఫికేషన్లతో వైద్యశాఖలో ఉద్యోగాల జాతర నెలకొంది. మూడున్నరేళ్లలో రెండువేల మందికి పైగా ఉద్యోగులను ప్రభుత్వం వైద్య శాఖలో నియమించింది. వాటిలో 80 శాతం కొత్తగా క్రియేట్ చేసిన పోస్టులే కావడం విశేషం. పార్వతీపురం మన్యం జిల్లాలో అన్ని ప్రధాన ఆస్పత్రులు, పీహెచ్‌సీల పరిధిలోనూ పలు పోస్టులను భర్తీ చేశారు.

ఖాళీ అయిన వెంటనే భర్తీ

ఒకప్పుడు ఉద్యోగ విరమణ చేసినా, కాంట్రాక్ట్ ఉద్యోగులు మానేసినా వాటిని భర్తీ చేసేందుకు ఏళ్లు పట్టేది. దీంతో అరకొర సిబ్బందితో వైద్య సేవలకు తీవ్ర ఆటంకం కలిగేది. ఈ పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైద్యశాఖలో నిరంతర నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అందుకు సంబంధించి ఆదేశాలు జారీ చేయడంతో ఎప్పుడు ఖాళీ అయిన పోస్టులను అప్పుడే భర్తీ చేస్తున్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండడంతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు.

నియామకాల్లో పారదర్శకత

గత ప్రభుత్వం హయాంలో సిఫార్సులతోనే ఉద్యోగాలు ఇచ్చేవారు. ఆ సమయంలో ముడుపులు కూడా పెద్ద మొత్తంలో డిమాండ్ చేసేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ఏర్పాటు చేసి, ప్రతి నియామకాన్ని పారదర్శకంగా చేపడుతున్నారు. మెరిట్ ఆధారంగా నియామకాలు పూర్తి చేస్తున్నారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా మెరిట్ లిస్టులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. దీంతో అవినీతికి తావులేకుండా, రూపాయి ఖర్చులేకుండా అర్హులు ఉద్యోగాలు పొందగలుగుతున్నారు.

రోగులకు మెరుగైన సేవలు

ఒకప్పుడు సిబ్బంది కొరతతో రోగులకు అరకొరగా వైద్యసేవలు అందేవి. ప్రస్తుతం పరిస్థితి మారింది. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండడంతో ఎలాంటి లోపాలు తలెత్తకుండా సేవలు అందిస్తున్నారు. గతంలో పార్వతీపురం మన్యం జిల్లాలో కేవలం 40మంది స్టాఫ్ నర్సులు ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 99కి చేరింది. కొత్తగా 59 స్టాఫ్‌నర్సు పోస్టులను క్రియేట్ చేసి నియామకాలు చేపట్టారు. జిల్లాలో 59మంది వైద్యులు విధులు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 83కి చేరింది. జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యశాఖలో ఉద్యోగోన్నతులు వేగంగా కల్పించారని వైద్యులు అంటున్నారు.

ఎప్పటి ఖాళీలు అప్పడే భర్తీ



వైద్యశాఖలో నియామకాల ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. జిల్లా ఏర్పాటుతో వైద్యారోగ్య శాఖలో ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేస్తున్నాం. జిల్లాలో గల అన్ని పీహెచ్‌సీలలో ఇద్దరు చొప్పున వైద్యులను నియమించి ఫ్యామిలీ డాక్టర్ విధానం, పీహెచ్‌సీలలో పూర్తిస్థాయిలో వైద్యాన్ని అందించగలుగుతున్నాం. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బందిని నియమించాం.

– డాక్టర్ వినోద్, జిల్లా హెల్త్ ప్రొగ్రాం అధికారి, పార్వతీపురం మన్యం

మంచి పరిణామం



వైద్యశాఖలో ఒక్కఖాళీ కూడా లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం మంచి పరిణామం. ఎప్పటికప్పుడు అధికారుల నుంచి ఖాళీల వివరాలను తీసుకుని, నోటిఫికేషన్లు ఇస్తూ ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారు. దీంతో పూర్తిస్థాయిలో ఉద్యోగులు అందుబాటులో ఉండడంతో రోగులకు సకాలంలో సేవలు అందించగలుగుతున్నాం. ఒకప్పుడు ఇద్దరు, ముగ్గురు చేసే పని ఒకరు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– డాక్టర్ బి.జగన్నాథరావు, డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం

ఘనంగా బోనాల పండగ


చిన్నారులను పడుకోపెట్టి బోనాలతో దాటించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


బోనాలతో గుడి వద్దకు వెళ్తున్న భక్తులు

బలిజిపేట: తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు సజీవంగా ఉంటున్నాయి. దీనికి ప్రాంతీయభేదాలు లేవు. తెలంగాణలో నిర్వహిస్తున్న బోనాల పండగ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోని ఒక మారుమూల గ్రామంలో ఈ పండగను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. బలిజిపేట మండలంలోని మిర్తివలస గ్రామంలో 3తరాల నుంచి సంప్రదాయంగా బోనాల పండగను సంక్రాంతి పర్వదినాన నిర్వహించారు. ఈ గ్రామంలో తెలగజాతి వారు ఎక్కువగా ఈ పండగను నిర్వహిస్తారు. వారిలో కుటుంబాల పరంగా గన్ను, గునపర్తి, మానం, శిగురుకోట, గంగు, గుండాపు కుటుంబాలవారు ఉన్నారు. ఊరందరికీ ఆరాధ్యదైవమైన ఉంటున్న ఎంకమ్మ పేరంటాలను వారు భక్తిప్రపత్తులతో కొలుస్తారు. 5కుండలకు పసుపు, కుంకుమలు రాసి బొట్లు పెట్టి పూలతో అలంకరించి బోనాలుగా పిలుస్తారు. కుటుంబాల పరంగా వారివారి ఇళ్లలో వాటిని ఉంచి 5కుండలలో కలగాయకూర, పరమాణ్ణం, మైదాపిండి అట్లు, అరిసెలు, అంటిపళ్లు వేసి బోనాలను పూజించి ఇళ్ల నుంచి బయలుదేరి గ్రామం శివారున ఉన్న ఎంకమ్మపేరంటాలు గుడి వద్దకు వెళ్లి భక్తి, ప్రపత్తులతో మొక్కి పూజలు చేశారు. బోనాలుతో ఇంటినుంచి బయలుదేరేటప్పుడు ఇంటియజమానురాలు తలపై బోనం పెట్టుకోగా భర్త సంప్రదాయ పద్ధతిలో దుస్తులు ధరించి అనుసరించాడు. బోనాలతో నడిచేవారి కాళ్లకింద బట్టలు వేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఇలా అందరూ కలిసి ఎంకమ్మపేరంటాలు గుడికి చేరుకుని బోనాలులో ఉంచిన ప్రసాదాలను స్వీకరించి పునీతులయ్యారు. అక్కడే అన్నం, సాంబారుతో భోజనాలు చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

అమెరికాలో పాలకొండ విద్యార్థి మృతి


సాయి నికేష్ (ఫైల్)

పాలకొండ రూరల్: ఉన్నత చదువులు అభ్యసించేందుకు అమెరికాకు వెళ్లిన కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తెలియడంతో తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. దీనిపై మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం కొత్తకోటకు చెందిన రాకోటి వెంకటమణ భవన నిర్మాణ పనులు ఇతర రాష్ట్రాల్లో చేసేవారు. ఇటీవల భార్య ఆదిలక్ష్మి, కుమారుడు సాయి నికేష్ (21), కుమార్తె అలేఖ్యతో కలిసి పాలకొండ ఎన్ఎస్ఎన్ కాలనీకి వచ్చి నివాసం ఉంటున్నారు. గడిచిన 19 రోజుల క్రితం సాయి నికేష్ అమెరికాలోని హార్ట్‌ఫోర్డ్ సిటీలో గల సేక్రెడ్ హార్ట్ యూనివర్సిటీలో ఎంఎస్‌లో చేరాడు. నికేష్‌తో పాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్, గుంటూరుకు చెందిన మరో విద్యార్థి అదే యూనివర్సిటీలో చేరారు. దీంతో ఆ ముగ్గురు విద్యార్థులు అక్కడ ఓ ప్రత్యేక గది తీసుకుని ఉంటున్నారు. అయితే ఈనెల 13వ తేదీన శనివారం రాత్రి గుంటూరుకు చెందిన విద్యార్థి మరో స్నేహితుడితో కలిసి సినిమాకు వెళ్లడంతో సాయి నికేష్, మహబూబ్‌నగర్ విద్యార్థి అద్దెకు తీసుకున్న గదిలో నిద్రించారు. గుంటూరు విద్యార్థి ఆదివారం ఉదయం గదికి చేరుకునే సమయానికి సాయినికేష్‌తో పాటు మహబూబ్‌నగర్ విద్యార్థి మృతిచెంది ఉండడాన్ని గుర్తించి ఫిర్యాదు చేయగా అమెరికా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలకు పోస్టుమార్టం చేయించి, దర్యాప్తు చేపట్టారు.

ఆకట్టుకున్న 'ఎడ్లబళ్ల పోటీలు'

- విజేతగా నిలిచిన ఆమిటి ఎడ్లు


తెర్లాం: పోటీల్లో విజేతగా నిలిచిన పెద్దింటి కూర్మినాయుడు ఎడ్లు


వేపాడ: కృష్ణారాయుడుపేటలో ఎడ్ల పరుగు ప్రదర్శనలో పరుగుతీస్తున్న ఎడ్లు


ప్రథమ విజేత కూర్మినాయుడును రూ.10వేలు నగదు బహుమతితో సత్కరిస్తున్న స్పాన్సర్లు, గ్రామ పెద్దలు


వేపాడ: విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ తదితరులు

తెర్లాం: కనుమ పండగ సందర్భంగా తెర్లాం మండలంలోని ఆమిటి గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల బళ్ల పోటీలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండగ సందర్భంగా కనుమ రోజున గ్రామంలో ఎడ్ల పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తెర్లాం, బాడంగి మండలాల నుంచి అధిక సంఖ్యలో రైతులు తమ ఎడ్లతో వచ్చి ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎడ్లబళ్ల పోటీల్లో ఆమిటి గ్రామానికి చెందిన పెద్దింటి కూర్మినాయుడు ఎడ్లు తక్కువ సమయంలో లక్ష్యాన్ని చేరుకుని ప్రథమ స్థానంలో నిలిచాయి. మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన వెలమల వెంకటనాయుడు ఎడ్లు ద్వితీయ స్థానం, గుల్లిపల్లి రామకృష్ణ ఎడ్లు తృతీయ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలైన రైతులకు ప్రథమ బహుమతిగా షీల్డ్, రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు చొప్పున స్పాన్సర్లు, నిర్వాహకులు అందజేశారు. ఆమిటిలో జరిగిన ఎడ్ల బళ్ల పోటీలను తిలకించేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఎడ్ల బళ్ల పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను గ్రామ పెద్దలు, యువత చేశారు. కార్యక్రమంలో ఆమిటి సర్పంచ్, ఎంపీటీసీలతోపాటు గ్రామ పెద్దలు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉల్లాసంగా ఎడ్ల పరుగు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో సోమవారం సాయంత్రం ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా ఉల్లాసంగా నిర్వహించారు. గ్రామానికి కృష్ణారాయుడు తీర్థమహోత్సవం సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో. విజయనగరం,అనకాపల్లి జిల్లాలకు చెందిన 16 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. వల్లంపూడి గ్రామానికి చెందిన సిద్ధివినాయక ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.14వేలు, రెండోస్థానంలో నిలిచిన వావిలపాడు గండి వెంకటరావు ఎడ్లు రూ.12వేలు, అనకాపల్లి జిల్లా లెక్కలవానిపాలెం గ్రామానికి చెందిన జై వీర సత్యం ఎడ్లు మూడోస్థానంలో నిలిచి రూ.పదివేలు, నాల్గో స్థానంలో ఎం.మాడుగులకు చెందిన జై వీరాంజనేయ ఎడ్లుకు రూ.ఎనిమిదివేలు, ఐదోస్థానంలో నిలిచిన దేవరాపల్లికి చెందిన సిద్ధి వినాయక ఎడ్లుకు రూ.ఆరువేలు చొప్పున నగదు బహుమతులను ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ బాలబాబు, మాజీసర్పంచ్ పైడిబాబు తదితరులు దాతల చేతుల మీదుగా విజేతలకు అందజేశారు.

రామతీర్థంలో వైభవంగా గో పూజా మహోత్సవం


ఉత్తరరాజగోపురం వద్ద గోపూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో గోపూజా మహోత్సవాన్ని ఆలయ అర్చకులు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు మన సంస్కృతి-మన పండగ కార్యక్రమంలో భాగంగా ఉత్తర రాజగోపురం వద్ద సంప్రదాయ బద్ధంగా గో మాతకు పూజలు చేపట్టారు. శ్రీసూక్తంతోను, గో అష్టోత్తర మంత్రంతోనూ, గోవుకు షొడశోపచారాలతో పూజాదికాలు చేశారు. గోవు సకల దేవతలకు ఆవాసస్థానం కావడం చేత గోవును పూజించడం వల్ల దేవతలందరినీ పూజించిన ఫలితం దక్కుతుందని అర్చకులు వివరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ కిశోర్‌కుమార్, అర్చకులు సాయిరామాచార్యులు, కిరణ్ కుమారాచార్యులు, పవన్, రామగోపాల్, సీనియర్ అసిస్టెంట్ రామారావు, భక్తులు పాల్గొన్నారు.

మిస్టర్ ఆంధ్రా పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



మిస్టర్ ఆంధ్రా పోటీల్లో సాధించిన పతకాలతో రమణ, లక్ష్మణరావు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 14న పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో జరిగిన ఈ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న దీపిల్లి రమణ 80 కేజీల విభాగంలో 5వ స్థానం సాధించగా..పట్నాన లక్ష్మణరావు 75 కేజీల విభాగంలో 5వ స్థానం దక్కించుకున్నాడు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి శంకరరావు, కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావులు అభినందించారు.

'జ్ఞాపకాల పొరల్లోంచి' పుస్తకావిష్కరణ

- తల్లి సోములమ్మకు అంకితం చేసిన రచయత


పుస్తకావిష్కరణలో రచయత తల్లి సోములమ్మను సత్కరిస్తున్న కుటుంబసభ్యులు తదితరులు

కొమరాడ: మండలంలోని దళాయపేట గ్రామానికి చెందిన ప్రముఖ కథా రచయత గంటేడ గౌరునాయుడు మాస్టార్ సంక్రాంతి పండగ సందర్భంగా 'జ్ఞాపకాల పొరల్లోంచి' అనే పుస్తకాన్ని గ్రామంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పాడుదమా స్వేచ్ఛాగీతం గీత రచయితగా ఖ్యాతి గడించిన గంటేడ గౌరునాయుడు స్నేహ కళాసాహితీ సంస్థను స్థాపించి ఉత్తారాంధ్ర నుంచి ఎందరో కవులు తయారు చేసిన ఘనత ఆయనకే సొంతమని ప్రశంసించారు. జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు, పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారని తాను పుట్టి 70 సంవత్సరాల కాలంలో ఎన్నో కథలు రాసి ఈ సమాజానికి స్ఫూర్తి నిచ్చారన్నారు. కార్యక్రమంలో రచయత గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ నా తల్లి సోములమ్మ 90ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పండగ రోజులను స్నేహితులు, బంధువుల మధ్య సొంత గ్రామంలో గడిపి ఈ పుస్తకావిష్కరణ చేసినట్లు పేర్కొన్నారు. పుస్తకాన్ని తన మాతృమూర్తి సోములమ్మకు అంకితం చేస్తున్నానంటూ ఆనందం వ్యక్త చేశారు. కార్యక్రమంలో గంటేడ చిన్నంనాయుడు కుటుంబసభ్యులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

జామి ఆనకట్ట వద్ద పర్యాటకుల సందడి


ఆనకట్టవద్ద పర్యాటకులు

జామి: మండలకేంద్రమైన జామిలోని గోస్తనీ నదివద్ద ఉన్న ఆనకట్ట దగ్గర వాటర్‌ఫాల్స్ మాదిరిగా ఉండడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. పండగ కావడంతో మండలంలోని పలు గ్రామాలనుంచి వచ్చిన బంధువులు, స్నేహితులు అధిక సంఖ్యలో వాటర్‌ఫాల్స్‌ను చూడడానికి వచ్చి స్నానాలు చేసి కేరింతలతో సందడి చేశారు. జాగరం గెడ్డ నుంచి వచ్చేనీరు ఆనకట్టమీదుగా గోస్తనీ నదిలోకి ప్రవహిస్తుంది. ఈ ప్రాంతం స్నానాలు చేయడానికి, తిలకించడానికి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. దీంతో పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. గతంలో ఈ ప్రాంతం వద్ద ముగ్గురు మునిగి మృతిచెందారు. తరువాత పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఇక్కడ పహారా ఏర్పాటుచేశారు. మళ్లీ ఈఏడాది పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆండ్ర జలాశయంలో వ్యక్తి మృతి


మెంటాడ: జలాశయంలో అప్పలనాయుడు మృతదేహం

మెంటాడ: మండలంలోని జయితి గ్రామానికి చెందిన సతివాడ అప్పలనాయుడు(59) ఆండ్ర జలాశయంలో మృతిచెందినట్లు హెచ్‌సీ రమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మృతుడి కుమారుడు నారాయణరావు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ప్రభుత్వాస్పత్రికి తరలించనున్నామని చెప్పారు. రెండు రోజుల క్రితం తన బంధువుల ఇంటికి గొర్రె పోతులను కొనుగోలు చేసేందుకు వెళ్లిన అప్పలనాయుడు జలాశయంలో శవమై కనిపించాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా వివరాలు సేకరించి విచారణ చేపడతామని వివరించారు.

శతాధిక వృద్ధురాలు..



రాజాం: పోల అచ్చియ్యమ్మ(ఫైల్)

వంగర: మండల పరిధి కొత్తమరువాడలో శతాధిక వృద్ధురాలు పోల అచ్చియ్యమ్మ (110) సంక్రాంతి రోజున మృతిచెందింది. వయోభారం మీద పడడంతో ఇంటివద్దనే ఆమె తుదిశ్వాస విడిచింది. అందరితో కలిసిమెలసి ఉండడమే కాకుండా, స్నేహభావంగా మెలిగే అచ్చియ్యమ్మ మృతిచెందడంతో గ్రామస్తులు విషాదం వ్యక్తం చేశారు. అయితే గ్రామంలో అత్యధిక వయసు కలిగిన వృద్ధురాలు ఉండడంతో ఎంతో సంతోషంగా ఉండేదని సర్పంచ్ గాడి కృష్ణవేణితోపాటు పలువురు పెద్దలు ఆమె జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మంగళవారం ఆమె అత్యక్రియలను కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు నిర్వహించారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పాలకొండ రూరల్: పట్టణంలోని గారమ్మకాలనీ సమీపంలో గల రాయుడు కోనేటి గట్టుపై పేకాట ఆడుతున్న ఏడుగురిని ఎస్సై హేమంత్ కుమార్ మంగళవారం అరెస్టు చేశారు. జూదరుల నుంచి రూ.9110 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే స్థానిక వెంకటగౌరి సినిమా థియేటర్ సమీపంలో రేగిడి మండలం సంకిలి గ్రామానికి చెందిన ఎం.దాలన్నదొర అనే వ్యక్తి 12 మద్యం బాటిల్స్ అక్రమంగా కలిగి ఉండడాన్ని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రయాణికుల భద్రతే ప్రధానం



రోడ్డు భద్రతా మాసోత్సవాల బ్యానర్ ప్రదర్శిస్తున్న డీఎం వెంకటేశ్వరావు, ఆర్టీసీ ఉద్యోగులు

పాలకొండ రూరల్: ప్రయాణికుల భద్రతే ప్రధానంగా బస్సులు నడపాలని ఆర్టీసీ డ్రైవర్లకు పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు సూచించారు. డిపో పరిధిలో సోమవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలుపులు, పాఠశాలల కూడళ్లు, జన సముదాయాలు, వాహనాల రద్దీ అధికంగా ఉన్నచోట జాగ్రత్తలు పాటించాలన్నారు. విధులకు హాజరయ్యే డ్రైవర్, కండెక్టర్ బస్సును డిపో నుంచి బయటకు తీసుకువచ్చే క్రమంలో వాటి కండీషన్ సరి చూసుకోవాలని, సమస్యలు గుర్తిస్తే సంబంధిత విభాగం అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఈయూ జోనల్ సెక్రట్రీ బి.కె.మూర్తి, స్టోర్ ఏడీసీ డీవీఎస్.రాజు, ఎంఎఫ్ ఏడీసీ ఎస్.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.